క్లుప్తంగా...

ఉత్తమ బోధనతో మంచి విద్య అందుతుంది

రాయదుర్గం: సమర్థవంతమైన బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ సిరాజ్అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలగజేయడం ఉపాధ్యాయులకు అతిపెద్ద, ప్రధానమైన సవాలు అని అన్నారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ అభివృద్ధిలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం డాక్టర్ రుబీనా రచించిన 'వ్యక్తిత్వ వికాసంలో సహపాఠ్య కార్యక్రమాల పాత్ర' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు.

హెచ్‌సీయూను సందర్శించిన విదేశీ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని మాల్దీవుల నుంచి జర్నలిస్టులు/సంపాదకుల ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. పునరుత్పాదక ఇంధనం, పరిశ్రమలు, రక్షణ, పాలన, ఐటీ సేవలు, విద్య, ఫార్మాస్యూటికల్స్ రంగాలలో భారతదేశం సాధించిన విజయాలను విదేశీ మీడియాకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. మాల్దీవుల ప్రతినిధి బృందానికి హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆయన వారితో సమావేశమై విద్యా, పరిశోధన, సౌకర్యాల గురించి వివరించారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని వివిధ విభాగాలు, ఇంక్యుబేటర్లలో కల్పించిన సౌకర్యాలను కూడా ఈ ప్రతినిధి బృందం పరిశీలించింది.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్‌కు 25 శాతం జరిమానా

గచ్చిబౌలి: ట్రేడ్ లైసెన్స్‌ను మే 31 లోపు రెన్యూవల్ చేసుకుంటే కేవలం 25 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ప్రియాంక ఆదేశాలు జారీ చేశారని వెస్ట్ జోనల్ లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 12 నుంచి 31 లోపు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకున్న వారు 25 శాతం పెనాల్టీ చెల్లించాలని, జూన్ ఒకటి నుంచి రెన్యూవల్ చేసుకునే వారు 50 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

చందానగర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పుణ్యాహవచనం, సంకల్పము, విశ్వక్సేన పూజ, దీక్షధారణ, అకల్మష హోమం, అంకురార్పణ, వాస్తు పూజ, అగ్ని మదనం, ధ్వజారోహణ, హోమాలను నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ సభ్యులు తెలిపారు.

పోస్టర్ మేకింగ్ పోటీలు

రాయదుర్గం: మనూలో శుక్రవారం పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు సంబంధించి పోస్టర్ మేకింగ్ పోటీని నిర్వహించింది. ఎంఈడీ, బీఈడీ, డీఎల్ఈడీ కోర్సుల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే అంశంపై ఈ పోటీని విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో సిర్వత్ జహాన్(డీఎల్ఎడ్), ద్వితీయ స్థానంలో సాదియాషబ్నమ్(డిఎల్ఎడ్) తృతీయ బుష్రా ఫాతిమా(బీఎడ్) నిలిచారు. వారికి బహుమతులను ప్రదానం చేశారు.

బీజేపీ పాదయాత్రలకు ప్రజల మద్దతు



రాయదుర్గంలో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బీజేపీ పాదయాత్రకు ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి రాయదుర్గంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి కనీసం పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించడం చేతకాలేదని, ప్రతి ఒక్కటీ లీకేజీ నేనని, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించడమే ఈ పాదయాత్రల లక్ష్యమన్నారు. కృష్ణముదిరాజ్, కృష్ణ యాదవ్, నరేందర్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, నరేందర్‌యాదవ్, హన్మంతునాయకల నరేందర్ గౌడ్, శ్యామ్ యాదవ్, పద్మ, సుజాత, రేణుక పాల్గొన్నారు.

ఉద్రిక్తతకు దారితీసిన కూల్చివేతలు

- చిత్రపురిలో విల్లాలు కూల్చిన హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ
- అడ్డుకున్న స్థానికులు
- సోమవారం వరకు అనుమతి పత్రాలు ఇవ్వాలన్న అధికారులు



చిత్రపురి కాలనీలో గుమికూడిన స్థానికులు

మణికొండ: తీసుకున్న అనుమతుల కంటే అదనంగా నిర్మించిన విల్లాలను కూల్చేందుకు వెళ్లిన అధికారులపై స్థానికులు తిరగబడటంతో ఉద్రిక్తతకు దారి తీసింది. ఎలాంటి ఆదేశాల పత్రాలు లేకుండా ఇష్టనుసారంగా వచ్చి కూలుస్తారా.. అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో కూల్చివేతలు చేపడుతున్న అధికారులు, సిబ్బందిపై స్థానికులు దాడికి యత్నించారు. సకాలంలో స్పందించిన పోలీసులు హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులను ఓ గదిలోకి తరలించి అక్కడి నుంచి పూర్తి భద్రతతో బయటకు తీసుకొచ్చారు.

- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అనుమతుల కంటే అదనంగా విల్లాలను నిర్మించారు. వాటిపై కోర్టు వివాదాలు కూడా ఉన్నాయి. దీంతో గతంలోనే వాటిని కూల్చటం, సీజ్ చేయటం చేసినట్టు సమాచారం. నిర్మాణాలు యథాతథంగా కొనసాగిస్తుండటంతో శుక్రవారం హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ అధికారుల బృందం అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన ఆరు విల్లాలు, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన మరో 10 విల్లాలను కూల్చివేశారు.

స్థానికుల కోపోద్రేకం..

అనేక వివాదాలతో చాలా సార్లు పనులను ఆపేసి తిరిగి నిర్మాణాలను పూర్తి చేస్తుంటే ఎలాంటి కోర్టు ఆదేశాలు లేకుండా ఏవిధంగా కూల్చివేస్తారని బాధితులు ప్రశ్నించారు. విల్లాలను కూల్చాలని ఉన్న ఆదేశాలను తమకు చూపాకనే పనులు చేపట్టాలని పట్టుపట్టారు. ఓ దశలో వారు కోపోద్రిక్తులై హెచ్ఎండీఏ, మున్సిపల్ అధికారులపైకి దాడులు చేసేందుకు యత్నించారు. ఈ సందర్భాన్ని గమనించిన రాయదుర్గం పోలీసులు సీఐ మహేష్ ఆధ్వర్యంలో సకాలంలో స్పందించి వారిని ఓ విల్లాలోకి తీసుకుని వెళ్లి రక్షణ కల్పించారు. అనంతరం వారి చుట్టూరా.. భద్రత కల్పించి వారిని అక్కడి నుంచి తప్పించారు.

- రెండు రోజుల్లో నిర్మాణదారుల వద్ద ఉన్న అనుమతి పత్రాలను సమర్పించాలని లేదంటే హెచ్ఎండీఏ నుంచి పొందిన తరువాతనే పనులు చేసుకోవాలని అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ టీపీఓ రాకేష్, స్థానిక కౌన్సిలర్లు హైమాంజలిఅనిల్‌కుమార్, వసంతరావు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యుడు రఘు తదితరులున్నారు.



విల్లాలను కూలుస్తున్న మున్సిపల్, హెచ్ఎండీఏ సిబ్బంది

భట్టి విక్రమార్క పాదయాత్రకు తరలిన నేతలు



పాదయాత్రలో పాల్గొన్న రాజేంద్రనగర్ సర్కిల్ నాయకులు

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ నాయకులు భట్టి విక్రమార్క చేపడుతున్న పాదయాత్రకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల పార్టీ అధ్యక్షులు ముద్దగౌని భాస్కర్ గౌడ్, కోరని బాల్‌రాజ్, ధనుంజయల ఆధ్వర్యంలో ఉదయం పాదయాత్రకు ర్యాలీగా బయలుదేరారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పాదయాత్ర చేవెళ్ల నియోజకవర్గానికి తరలివెళ్లింది. ఈ సందర్భంగా ముద్దగౌని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. అడుగడుగున రైతులు, నిరుద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు తమ బాధలను తెలిపారన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు, స్థానికులు

ఆర్టీసీని ఆదరించండి !

మణికొండ: ప్రజా రవాణాలో భాగస్వామం అవుతున్న ఆర్టీసీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని డిప్యూటీ జనరల్ మేనేజర్ అపర్ణ కల్యాణి అన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూడలిలో నిర్వహించిన ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు మణికొండ మీదుగా బస్‌లు నడపాలని మణికొండలో కంట్రోల్ పాయింట్ ఏర్పాటు చేయాలని బస్‌ల సమయాలను పేర్కొనే బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

- బస్‌షెల్టర్‌లను ఏర్పాటు చేసి ఉన్న వాటిల్లో సౌకర్యాలను కల్పించాలని అధికారుల దృష్టికి ఆమె తీసుకొచ్చారు. అనంతరం ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ.. నార్సింగి నుంచి సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, మెహిదీపట్నం, మియాపూర్ మెట్రోరైల్‌స్టేషన్, జేఎన్‌టీయూకు బస్సులను నడుపుతున్నామని వాటిని ఆదరించాలన్నారు. రూ.80తో 24 గంటలు, రూ.50కి సిటీలో 24గంటలు, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఏ బస్సులోనైనా ప్రయాణించే సౌకర్యం ఉందన్నారు. తిరుమల దర్శన టికెట్లతో పాటు ప్రయాణానికి సౌకర్యం ఉందని వాటిని వినియోగించుకోవాలని కోరారు. డిపో మేనేజర్ లక్ష్మి, సీఆర్‌సీ ధర్మేంద్ర, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, వీఫర్‌యూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బాపూజీ, ప్రధాన కార్యదర్శి సీతారాందాస్, కోశాధికారి దిలీప్‌కక్కడ్, సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సాయి గ్రామర్ హైస్కూల్ ముందంజ



జి.నవ్య | పి.శ్రావణి | ఎం.గ్రీష్మా | మురళీధర్ | దీపిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కాటేదాన్ పద్మశాలిపురంలోని సాయి గ్రామర్ హైస్కూల్ విద్యార్థులు పదోతరగతి పరీక్షా ఫలితాలలో ప్రభంజనం సృష్టించారు. ఐదుగురు విద్యార్థులు జీపీఏ 10/10 సాధించి రాజేంద్రనగర్ మండల పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.శ్రీలక్ష్మీ 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కె.దీపిక, ఎం.గ్రీష్మ, ఆర్. మురళీధర్, జి.నవ్య, శ్రావణిలు 10/10 జీపీఏ సాధించగా.. బి.వైష్ణవి జీపీఏ 9.8, శిరీష, కె.సిద్ధార్థ, జీపీఏ 9.5, ఎ.శ్రావ్య జీపీఏ 9.0 గ్రేడ్ పాయింట్లు సాధించి రాజేంద్రనగర్ మండల పరిధిలోనే సాయి గ్రామర్ హైస్కూల్ మొదటి స్థానంలో నిలిచిందని ఆమె హర్షం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో సాయి గ్రామర్ హైస్కూల్ ముందుంటుందన్నారు.

ఫైనాన్సియర్ వేధింపులు భరించలేక మహిళ ఆత్మహత్యాయత్నం

రాజేంద్రనగర్: ఫైనాన్సియర్ వేధింపులను భరించలేక ఓ గృహిణి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపిన వివరాల ప్రకారం... సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన షకీరా (25), మహ్మద్ నహీం (30) దంపతులు. కాగా భార్య తన అవసరాల కోసం ఓ ఫైనాన్సియర్ వద్ద రూ.2 లక్షలు అప్పు తీసుకుంది. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో డబ్బులు చెల్లించడంలో ఆలస్యమైంది. దీంతో ఫైనాన్సియర్ డబ్బులు కావాలంటూ ఫోన్ చేయడంతో పాటు ఇంటి వద్దకు వస్తున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన షకీరా గురువారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలను ఆర్పి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్‌పోర్టులో మహిళ అదృశ్యం



రాధా (ఫైల్)

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఓ మహిళ అదృశ్యమైంది. ఎస్సై తరుణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖైన్‌స్వాయికి చెందిన మతారా అతడి భార్య రాధా దంపతులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని ఏరినా వివో సర్కిల్ వద్ద తోటమాలి పనిచేస్తూ.. స్థానికంగానే నివాసం ఉంటున్నారు. ఈ నెల 8న పని నుంచి సాయంత్రం ఇంటికి చేరుకున్న రాధా (25) బయటికి వెళ్లి తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నార్సింగిలో లెప్రసీ రిఫరల్ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభించిన వైద్యాధికారులు

మణికొండ: కుష్టు, బోదకాలతో బాధపడుతున్న రోగులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెప్ర సొసైటీ ముందుకొచ్చిందని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్‌బాబు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి వేంకటేశ్వర్‌రావులు అన్నారు. శుక్రవారం నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిలో లెప్రా సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన రెఫరల్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిగ్రస్తులకు ఫిజియోథెరపీ, బోధ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పాదరక్షలు, అవసరమైన మందులను స్థానికంగానే అందిస్తారన్నారు. ఇలాంటి రోగులను గుర్తించి వారిని ఆసుపత్రికి తీసుకొచ్చి సరైన సేవలను అందించాలని ఆశవర్కర్‌లు, వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ అరుణ, జిల్లా ఉప వైద్యాధికారులు డాక్టర్ సృజన, డాక్టర్ కామేశ్వర్‌రావు, ప్రాజెక్టు అధికారి, మండల వైద్యాధికారి డాక్టర్ పద్మ, అధికారులు పద్మారావు, రవీందర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్టీసీ బస్సు రూట్లు మార్పు

- 3 నెలల పాటు కొనసాగింపు
- నేటి నుంచి ఆగష్టు 10 వరకు..
- శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో రోడ్డు మూసివేత

రాయదుర్గం: ఆర్టీసీ బస్సు రూట్లు మారాయి. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డును 90 రోజులపాటు మూసివేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు ఈ మార్పు అమలులో ఉంటాయి.

- రూట్ నంబర్ 216కె/ఎల్ బస్సును లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వెళ్ళే బస్సు... రాడిసన్ హోటల్ ఎక్స్‌రోడ్డు నుంచి మీనాక్షి టవర్స్, ఐకియా, బయోడైవర్సిటీ ఎక్స్ రోడ్డు రూట్ ద్వారా రాకపోకలు జరుగుతాయి.
- రూట్ నంబర్ 221 బస్సు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మంచిరేవుల బస్సును... రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్ నుంచి గచ్చిబౌలి వరకు రాకపోకలు జరుగుతాయి.
- రూట్ నంబర్ 10 హెచ్‌డబ్ల్యూ బస్సు సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్.. బస్సును రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్, విప్రో సర్కిల్ మీదుగా రాకపోకలు చేస్తాయి.
- ఈ రూట్ మార్పులను 90 రోజులపాటు అమలు చేస్తామని, ప్రయాణికులు గమనించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి



మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌లో 250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని ప్రారంభించిన చైర్మన్ సతీష్‌రెడ్డి , ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: గేటెడ్ కమ్యూనిటీలు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్ వై. సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన 250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, రెడ్కో వైస్ చైర్మన్ జానయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు బాగుండాలి, కాలుష్యం నివారించాలనే ఉద్దేశ్యంతో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గేటెడ్ కమ్యూనిటీలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీలో నంబర్ వన్‌గా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణాలలో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని పునరుత్పాదక శక్తి వైపు మళ్ళాల్సిన ఆవశ్యకత చాలా ఎక్కువగా ఉందన్నారు. రూఫ్‌టాప్ ప్యానెల్స్‌ను పెడితే పై కప్పుకూడా వేడెక్కడం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, ఫార్చ్యూన్ టవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగంటి సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రామారావు, సభ్యులు, రెడ్కో అధికారులు పాల్గొన్నారు.

నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ కార్పొరేటర్లు, నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సేవలో మజ్లిస్ ఎప్పుడూ ముందుంటుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో నానల్‌నగర్ కార్పొరేటర్, మజ్లిస్ సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నానన్నారు. ఈ డివిజన్‌కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని ఆయన అన్నారు. గతంలో లాగా ఈ వర్షాకాలంలో నానల్‌నగర్ డివిజన్‌లో నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీలో ముంపు సమస్య ఉండదని ఆయన అన్నారు. అల్ హస్నాత్ కాలనీ ఎగువ ప్రాంతంలోని మిలటరీ ప్రదేశంలో ఉన్న బుల్కాపూర్ నాలా దారి మళ్లింపు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. నదీమ్ కాలనీ, బాల్‌రెడ్డినగర్, రియాసత్‌నగర్ కాలనీలలో కొత్త డ్రైనేజీలు వేశామని, ఈ కారణంగా వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, గోల్కొండ డివిజన్ నాయకులు బదర్ ఉద్దీ, హబీబ్ చావూస్ తదితరులున్నారు.

సినీ నటి హెబ్బా పటేల్ సందడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం మండుతున్న ఎండలకు నగరవాసులు ప్రత్యేక జాగ్రత్తలను తీసుకోవాలని సినీతార హెబ్బా పటేల్ సూచించింది. శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌ఆర్‌హెచ్ లగ్జరీ సెలూన్‌ను సినీ నటి హెబ్బా పటేల్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెబ్బా పటేల్ మాట్లాడుతూ., అందం ఆరోగ్యసంరక్షణలో భాగంగా మారిందని, అందరూ వ్యక్తిగత సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంలో మంత్రులు తలసాని, మహమూద్ అలీ, ఎమ్మెల్యే రాజాసింగ్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: పేద ప్రజలకు సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. అబిడ్స్ మురళీధర్‌బాగ్‌లో రూ.10 కోట్లతో నిర్మించిన 120 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే రాజాసింగ్, గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం దాదాపు రూ.10 లక్షలతో ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ నిర్మించిందని దాని విలువ మార్కెట్‌లో రూ.కోటి ఉంటుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కోటి రూపాయాల విలువైన డబుల్ బెడ్ రూమ్‌లను పేదలకు అందిస్తుందన్నారు. పేదలకు, బడుగు వర్గాలకు డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి సొంతింట్టి కలలను నిజం చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి అంటే దేశంలోనే తెలంగాణ నెంబర్:1 అన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. ఈ డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాల్లో షెటర్లు నిర్మించారని అవి స్థానికులకు కేటాయించాలన్నారు. ప్రజలకు అభివృద్ధి చేసేందుకు తాను ముందుంటానని పేర్కొన్నారు. మంత్రి తలసాని పార్టీలకు అతీతంగా ఎవరు వెళ్లినా పనులు చేసిపెడుతున్నారని ప్రశంసించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ చాలా బాగా ప్రజలకు సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఒకేసారి మంత్రి తలసానిపై ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశంసల వర్షం కురిపించడంతో సభలో ఉన్న ప్రజలందరూ అవాకయ్యారు. ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, నగర గ్రంథాలయ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, నేతలు ఆనంద్‌కుమార్‌గౌడ్, పూజవ్యాస్ బిలాల్, పురుషోత్తమ్‌రావు, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రసాద్, అధికారులు, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో కోడింగ్ పోటీలు



గోల్కొండ: కోడింగ్‌లో నైపుణ్యం గల వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని డయాటోస్ క్యాంపస్ అంబాసిడర్ శిరీష గూడ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కోడింగ్ పోటీలో నిర్వహించారు. కళాశాలలో విద్యార్థులు నిర్వహించే ది ఎరూడైట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను డయాటోస్–ఇ–టూ–ఇ హైరింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష గూడ మాట్లాడుతూ.. ఎరూడైట్స్ క్లబ్‌ను విద్యార్థులు స్వయంగా స్థాపించి ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. ఈ కోడింగ్ పోటీల్లో 4 ప్రశ్నలు ఉంటాయని, 45 నిమిషాల నిడివి గల ఈ పరీక్ష విద్యార్థినుల కోడింగ్ నైపుణ్యానికి పదును పెడుతాయన్నారు. కాగా ఈ పోటీల్లో స్వాధిక మొదటి బహుమతిని, భావన 2వ బహుమతిని పొందగా, లక్ష్మీ 3వ బహుమతిని పొందారు. కాగా వీరికి నగదు పురస్కారాలతో పాటు డాక్టర్ జరైన్ సింగ్, నాగశ్రీలు అందించి విజేతలను సన్మానించారు.

నెక్సాన్ ఈవీ మ్యాక్స్ డార్క్ ఎడిషన్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: సరికొత్త ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'టాటా నెక్సాన్ మ్యాక్స్ డార్క్ ఎడిషన్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని టాటా మోటార్స్‌లో జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోనల్ కమిషనర్ జె.శంకరయ్య, వెంకటరమణ మోటార్స్ డైరెక్టర్ విక్రమాదిత్యలు ఎస్‌యూవీ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. సేఫ్టీ, అడ్వాన్స్ ఫీచర్స్‌తో యువతను ఆకట్టుకుంటుందని డైరెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టెర్రిటరీ సేల్స్ మేనేజర్ , వెంకటరమణ మోటార్స్ సీఈఓ మహేందర్, జీఎం రవీందర్ పాల్గొన్నారు.